# ఆమెకోసం

"నన్ను నమ్మండి! నేను మీకు సహాయం చేయడానికే వచ్చాను."

ప్రతిమ ముప్పయ్ మూడేళ్ళ ఆ వ్యక్తికేసి సూటిగా చూసింది". నాకు ఎవరి సహాయమూ అక్కర్లేదు. ఈ సమస్యనుండి నేను బయటపడగలననే అనుకుంటున్నాను."

అతడు తల అడ్డంగా ఆడించాడు. "పరిస్థితులు ఎంత ప్రమాదకరంగా వున్నాయో మీకు అర్థంకావడం లేదు. మరో వారంరోజులు... ఓన్లీ ఇన్ వన్ వీక్....మీరు హత్య చేయబడుతారు. ఇది నిజం."

"మహేష్!..." ఆమె ఎంత పెద్దగా అరచిందంటే, పోర్టికోలో కారు తుడుచుకుంటున్న డ్రైవర్ అదిరిపడి, హాల్లోకి పరుగున వచ్చాడు. యజమానురాలు ఎర్రబడిన ముఖంతో వుండడం, ఎదురుగా తల దించుకుని నిలబడి వున్న మేనేజర్ని చూసి ఆఫీస్ వ్యవహారమేమోననుకుని వెంటనే అక్కడినుండి నిష్క్రమించాడు...నువ్వు... నువ్వు అనుమానిస్తున్నది ఎవర్నో తెలుసా?"

అతడు ఏమాత్రం తడబడలేదు. నింపాదిగా పలికాడు "తెలుసు మేడమ్! నేను మీ శ్రీవార్ని టార్గెట్ చేసి మాట్లాడుతున్నాను... మీరూ ఆలోచించండి. నేనలా అంటున్నానంటే ఆధారాలు లేకుండా అనగలనా?"

"ఆధారాలతో అంటున్నావో, మరేదైనా ఉద్దేశ్యంతో ప్లాన్ చేస్తున్నావో నాకనవసరం. నువ్వన్నదే కరక్ట్ అనుకున్నా... సమస్య నాది. నువ్వు ఎంటర్ కావడం నాకిష్టం లేదు. ఒకవేళ అనవసరంగా జోక్యంచేసుకుంటే, ఈ విషయాన్ని మావారి వరకూ తీసుకెళ్ళవలసి వుంటుంది."

మహేష్ పెదవులు బిగపట్టి తల అడ్డంగా ఆడించాడు 'ఒకప్పుడు ఆమె తనకు క్లాస్‌మేట్ కావచ్చు. ఇద్దరూ స్నేహంగా కలసిమెలసి తిరిగుండొచ్చు... బట్, ఇప్పుడు ఆమె తనకు యజమానురాలు! అతిగా మాట్లాడి, అత్యంత రహస్యంగా వుంచవలసిన విషయాన్ని, ఓపెన్ చేసి... ముఖ్యంగా 'అసలు వ్యక్తికే తెలిసేలా చేయడం కరెక్ట్ కాదు...'

అందుకే అతడు పది సెకనుల తర్వాత పలికాడు. "ఒ.కే. మేడమ్! నా దృష్టికి వచ్చిన విషయం మీకు చెప్పాను. నన్ను నమ్మినా, నమ్మకపోయినా ఫర్వాలేదు. మిమ్మల్ని మీరు కాపాడుకోగలిగితే అంతే చాలు..."

చివరి వాక్యం పలుకుతున్నప్పుడు అతడి కళ్ళల్లో నీరు కదలాడడం ఆమె చూసింది. అతడు వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

కొద్దిసేపు అలాగే నిలబడ్డాక, ఆమె పదడుగులు పక్కకు వేసి, అక్కడున్న ఫోన్ రిసీవర్ చేతిలోకి తీసుకుంది. పదిహేను క్షణాల తర్వాత, అవతలి వ్యక్తి 'హలో'అన్నాక చెప్పింది. "అంకుల్... నేను ప్రతిమను... అర్జంట్‌గా మిమ్మల్నోసారి కలవాలి... మీ ఆఫీసుకే వస్తున్నాను... పావుగంటలో అక్కడుంటాను...వుంటాను."


ప్రతిమ బయటకు నడిచింది.

పోర్టికోలో వున్న 'బిఎమ్‌డబ్ల్యూ' కారు వేగంగా ముందుకు పరుగెత్తింది.

⁂ ⁂ ⁂

"నిరుపమ్‌ని నువ్వు అనుమానిస్తున్నావా ప్రతిమా?!"

అరచేతులకేసి తదేకంగా చూస్తున్న ప్రతిమ తలెత్తింది. ఎదుటి వ్యక్తి కళ్ళల్లోకి చూస్తూ పలికింది. "అనుమానించడానికి కారణాలున్నాయ్ అంకుల్!... ఆ కారణాలేంటి అని మాత్రం అడక్కండి... పైగా 'వారంరోజుల్లో నా ప్రాణాలకు ముప్పు వుంది'అని చెప్పిన వ్యక్తి నా శ్రేయోభిలాషి. ఆ విషయంలో ఎలాంటి అనుమానమూ అక్కర్లేదు.'



ఏసిపి ఆదేశ్ ఆమె ముఖంలోని భావాలు పరిశీలించాక అడిగాడు. "నేనిప్పుడేం చేయాలో చెప్పు ప్రతిమా? నీకు సెక్యూరిటీ ఏర్పాటుచేయనా?"

"ఈ వారంరోజులు సెక్యూరిటీ ఏర్పాటుచేయగలరు, జీవితాంతం సెక్యూరిటీ ఇవ్వలేదుగా. ఐనా కట్టుకున్నవాడే కడతేర్చాలని అనుకున్నప్పుడు సెక్యూరిటీ మాత్రం ఏం చేయగలదు? పక్కలో బల్లెం ఎప్పుడైనా గుండెల్లో దిగొచ్చు:"

"నువ్వన్నది కరక్టే..." క్షణమాగి ప్రశ్నించాడు."... మరిప్పుడేం చేద్దాం?"

"నిరుపమ్‌ని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవాలి."

"చాలా కష్టమే!... ఏ నిముషాన ఏవైపునుండి ప్రమాదం వస్తుందో తెలియనప్పుడు తప్పించుకుంటూ, దాడికి కారణమైన వ్యక్తిని పట్టుకోవడం... ప్చ్!... బట్, నువ్వు కోరిన విధంగా నావైపునుండి సహాయ సహకారాలు అందిస్తాను... బీ కేర్‌ఫుల్..."

"థాంక్యూ అంకుల్."

⁂ ⁂ ⁂

ఇంట్లోనుండి బయటపడిన కారు రోడ్డెక్కింది.

ఆ ఇంటి మీదనే దృష్టిని నిలిపిన ఇద్దరు వ్యక్తులు, కారును చూడడంతోనే వేగంగా కదిలారు. ఓ పక్కగా ఆపి వుంచిన బైక్‌ని స్టార్ట్‌చేసి, ఆ కారును ఫాలో కాసాగారు.

పది నిముషాల తర్వాత కారు ఓ బార్ ముందు ఆగింది.

అతడు బార్‌లోకెళ్ళాడు. వారిద్దరూ అనుసరించారు.

కార్నర్ సీట్‌లో కూర్చున్న ఆ వ్యక్తి స్టీవార్డ్‌కి ఆర్డరిస్తుంటే, వారిద్దరూ మెల్లగా అటు నడిచి బ్యాక్‌సీట్స్‌లో కూర్చున్నారు.

పది నిముషాల తర్వాత మరో వ్యక్తి వచ్చి అతడితో కలిసాడు. "ఏరా నిరుపమ్! రమ్మన్నావెందుకు?!"

"మనసులో బాధ భరించలేకున్నానురా... కనీసం నీతో చెప్పుకుని బరువు తగ్గించుకుందామని పిలిచాను."

"ప్రతిమ మారదురా... ఆ విషయం నాకూ అర్థమయ్యింది. అందుకే నువ్వే ఏదైనా నిర్ణయం తీసుకోవాలి. లేకపోతే బార్‌లో కూర్చుని మనసులోని బరువు తగ్గించుకోవడానికి నన్ను పిలవడం ఇలా కంటిన్యూ అవుతూనే వుంటుంది."

"బట్...ఎలాంటి నిర్ణయం తీసుకోవాలి?"

"నిన్ను అనుమానిస్తూ, అవమానిస్తూ దూరంగా వుంచుతున్న ప్రతిమను అంటిపెట్టుకుని వుండవలసిన అవసరం నీకు లేదు... వెళ్ళిపో... ఆమెను వదిలి దూరంగా వెళ్ళిపో..."

నిరుపమ్‌ని ఫాలోఅవుతూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు వారి మాటలు వింటున్నారు.

బార్‌లోనుండి బయటకొచ్చాక ఆ ఇద్దరిలో ఒకరు మొబైల్ తీసి ఏసిపి ఆదేశ్‌కి కాల్ చేసారు. "సార్! నిరుపమ్‌ని నిన్నటినుండి ఫాలో అవుతున్నాం. తను ఎలాంటి ప్లాన్ చేయడంలేదన్నది నిజం..."

ఏసిపి ఆదేశ్ కొద్ది క్షణాల నిశ్శబ్దం తర్వాత చెప్పాడు. "ఐతే మీరిప్పటి నుండి ప్రతిమను ఫాలోకండి."

⁂ ⁂ ⁂

"చాలా కన్ఫ్యూజింగ్ సిట్యువేషన్ సార్! మీరేమో ప్రతిమ మీద అటాక్ జరగొచ్చని అంటున్నారు. ఆమెను ఫాలో అయినప్పుడు ఆమె భయం నటిస్తున్నట్టే వుంది తప్ప, భయపడడం లేదన్నది తెలిసిపోతోంది. మరి తనే ఇలా కంప్లయింట్ చేయడమంటే... బహుశా మనల్ని రాంగ్‌ట్రాక్‌లోకి తీసుకెళ్ళే తనే ప్లాన్ చేస్తుందేమో".

ఏసిపి ఆదేశ్ ఎదుటి వ్యక్తి ముఖంలోకి తదేకంగా చూసాక చెప్పాడు. "ప్రతిమ పదేళ్ళుగా నాకు తెలుసు. తనో బిజినెస్ మాగ్నెట్ కూతురు. కోట్ల ఆస్తికి వారసురాలు.

తనకూ ఏదో లవ్‌స్టోరీ వుంది. ఆ వ్యక్తిపట్ల సాఫ్ట్ కార్నర్ వుంది కాబట్టే తనను కంపెనీ జనరల్ మేనేజర్‌ని చేసింది. ఎందుకనో ఆ వ్యక్తి పట్ల కలిగిన నమ్మకం, అభిమానం కట్టుకున్న భర్తపట్ల ఆమెకు లేవు. అలాగని నాకున్న ఇంటిమసీతో చెపుతున్నాను- ప్లాన్ చేసి గేమ్ లాడేంత క్రిమినల్ మెంటాలిటీ తనలో లేదు. ... బట్, సమ్‌థింగ్ ఈజ్ గోయింగ్ ఆన్... అదేంటో మనం తెలుసుకోవాలి."

"తన మీద హత్యాప్రయత్నం జరగబోతుందని

జె.వి.బాబు

